సాక్షి చిత్తూరు

మంగళవారం । 7 । జనవరి । 2025



ఆశగా వచ్చి.. నిరాశగా వెనుదిరిగి!

గ్రీవెన్స్‌లో తమ సమస్యలు పరిష్కరిస్తారని ఆశగా చిత్తూరుకు వచ్చిన ప్రజలు నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. - 8లో



ఏఎస్‌ఐని సస్పెండ్ చేయాలని దీక్ష

పుంగనూరు ఏఎస్‌ఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ బాధితుడు మురళీనాయక్, తన కుమార్తెతో నిరసన దీక్ష చేపట్టాడు. - 8లో



రంగుపడింది..!

కూటమి అధికారంలోకి రావడంతో గుడులు, సర్కారు కార్యాలయాలకు పసుపు రంగు వేసి, పసుపుమయం చేశారు. - 8లో

న్యూస్‌రీల్

డైట్‌లో జిల్లాస్థాయి రంగోత్సవ్ పోటీలు రేపు

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో ఈ 8వ తేదీన జిల్లాస్థాయి రంగోత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్ తెలిపారు. సోమవారం డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాతోపాటు తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్, ప్రైవేటు యాజమాన్య పాఠశాలలు, కళాశాలల్లో 6 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థినీ, విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. జిల్లాస్థాయి రంగోత్సవ్ 2024–25 పోటీలు 8 విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. ప్రతి విభాగంలోనూ జిల్లాస్థాయి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారు ఈ నెలాఖరులో జరిగే రాష్ట్ర స్థాయిలో రంగోత్సవ్ పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధిస్తారన్నారు. రంగోత్సవ్ పోటీలో పాల్గొనే వారు ఏదైనా ఒక అంశంలో మాత్రమే పోటీ చేయాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు పాఠశాల యాజమాన్యం ద్వారా వై. శ్రీనివాసులురెడ్డి, 9347561448 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ టారిఫ్ పెంపుపై మంగళవారం నుంచి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. ఈ నెల 7, 8, 10వ తేదీల్లో చిత్తూరు ఎస్‌ఈ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇదివరకే రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు ఆ రోజుల్లో కార్యక్రమంలో పాల్గొన్నాలని కోరారు. ఏపీఈఆర్సీ ఇన్‌చార్జ్ చైర్మన్ రాంసింగ్ ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారన్నారు. వినియోగదారులు తమ అభిప్రాయాలను తెలపవచ్చన్నారు.

జెడ్పీలో కారుణ్య నియామకాలు



నియామకపత్రాలు అందుకున్న వారితో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ పరిధిలో కారుణ్య నియామకాలను చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం ఉద్యోగులకు నియామక పత్రాలను జెడ్పీ చైర్మన్ జీ శ్రీనివాసులు అందజేశారు. జెడ్పీ హైస్కూళ్లలో జూనియర్ సహాయకులుగా వీరికి పోస్టింగ్స్ ఇచ్చారు. సోమలకు పావని, ఎస్‌ఆర్‌పురానికి భానుప్రకాష్, అరుణ, బైరెడ్డిపల్లెకు మనీషా, విజయపురానికి హిమవర్ష, చిత్తూరుకు లోకేశ్వరి, వి.కోటకు సాగర్‌ను నియమించారు. విధి నిర్వహణలో నిబంధనలు తెలుసుకుని పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. అనంతరం వారికి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు శుభాకాంక్షలు తెలిపారు.

శుభ్రతే మందు

ఆందోళన వద్దు..

శుభ్రంగా ఉంటే సుబ్బరంగా బతికేయవచ్చని మన పెద్దలు ఎప్పుడూ చెబుతూ ఉంటారు. వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యమిచ్చే వారు ఆరోగ్యంగా ఉంటారనడంలో సందేహం లేదు. చైనాను గడగడలాడిస్తున్న హెచ్‌ఎంపీవీ వైరస్ దేశంలోనూ అడుగు పెట్టిన నేపథ్యంలో ప్రజలు కరచాలనం మాని, చేతుల శుభ్రత పాటిస్తే దాన్ని దూరంగా నెట్టేయవచ్చని వైద్యులు చెబుతున్నారు. అప్రమత్తత, అవగాహనే ముందు అని, వ్యక్తిగత శుభ్రతే చక్కటి మందు అంటున్నారు వైద్యనిపుణులు.



అమ్మో.. చైనా వైరస్..?

- కర్ణాటకలో హెచ్‌ఎంపీవీ గుర్తింపు
- ఇద్దరికి వైరస్ లక్షణాలు
- ఉలిక్కిపడుతున్న జిల్లా జనం
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు
- అప్రమత్తమైన ఆస్పత్రి అధికారులు


చిత్తూరు రూరల్ (కాణిపాకం): రెండేళ్ల పాటు దేశాన్ని కరోనా వైరస్ గజగజ వణికించింది. అది మరవక ముందే చైనా వైరస్(హెచ్‌ఎంపీవీ) దేశంలో చొరబడింది. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో తొంగి చూసింది. ఇద్దరికి హెచ్‌ఎంపీవీ లక్షణాలు బయటపడ్డాయి. దీంతో జిల్లా జనం ఉలికిపడుతున్నారు. వైరస్ వ్యాప్తితో స్వీయ జాగ్రత్తలు పాటించాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఆస్పత్రి వర్గాలు అప్రమత్తమయ్యాయి. ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆస్పత్రి వర్గాలకు ఆదేశాలిచ్చారు. దీన్ని అదునుగా భావించి, చైనా వైరస్‌ను వైరల్‌గా మార్చేందుకు మెడికల్ మాఫియా సిద్ధమైంది. ఈ మాఫియాకు భయపడొద్దని వైద్య నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

తొలి కేసు బెంగళూరులోనే..

చైనాలో విజృంభించిన హెచ్‌ఎంపీవీ వైరస్ భారత్‌లోకి ప్రవేశించింది. తొలి కేసు బెంగళూరు నమోదు కావడం కలకలం రేపుతోంది. రాయలసీమ జిల్లాలోకి ఎక్కడ ప్రవేశిస్తుందోనన్న భయాందోళన నెలకొంది. బెంగళూరులోని ఇద్దరు చిన్నారులకు చైనా వైరస్ హెచ్‌ఎంపీవీ సోకిందని ఐసీఎంఆర్ ధ్రువీకరించింది. రొటీన్ సర్వేలియన్స్‌లో వారిద్దరిలో మల్టిపుల్ రెస్పిరేటరీ వైరల్ పాథోజెన్స్‌ను గుర్తించామంది. ఆ ఇద్దరు బాధితులకు అంతర్జాతీయ ప్రయాణాలు చేసిన హిస్టరీ లేదని తేల్చిచెప్పింది. అయినప్పటికీ వ్యాధి రావడం అందరినీ కలవరపెడుతోంది. వీరిద్దరూ బెంగళూరులోని బాప్టిస్ట్ ఆస్పత్రిలోనే చికిత్స పొందడం గమనార్హం.

ఇదీ వైరస్..

కర్ణాటక రాష్ట్రంలో హెచ్‌ఎంపీవీ వైరస్ బయటపడింది. అయితే చాలా మంది ఏంటీ ఈ వైరస్ అనే అయోమయంలో పడ్డారు. కరోనాకు.. ఈ హెచ్‌ఎంపీవీ వైరస్‌కు తేడా ఏంటి అనే సందేహంలో ఉన్నారు. ఈ హ్యూమన్ మెటా ప్యూమైవెరస్ (హెచ్‌ఎంపీవీ) క్షీరదాలు, పక్షుల్లో శ్వాసకోశ సంబంధిత వ్యాధుల్ని కలగజేసే ఓ వైరస్ జాతికి చెందింది. చైనాలో ఈ వైరస్ ఎప్పటి నుంచో ఉందని, మూడేళ్లకు క్రితమే బయటపడిందని నిపుణులు వెల్లడిస్తున్నారు. అయితే కొన్ని రోజులుగా చైనాలో ఈ వైరస్ వ్యాప్తి పుంజుకుంది.



వ్యాప్తిపై ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం జోరందుకుంది. ఇది కూడా కరోనా మహమ్మారిలాగే విరుచుకుపడుంతోందా? అనే భయం ప్రజల్లో పుట్టుకొస్తోంది.

లక్షణాలివీ..

- కోవిడ్ 19, ఫ్లూ, ఇతర శ్వాసకోశ రుగ్మతలను పోలి ఉంటుంది.
- జ్వరం, దగ్గు, ముక్కు కారడం, గొంతునొప్పి తదితర లక్షణాలు ఉంటాయి.
- వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్నవారిలో బ్రాంకైటిస్, నియోనియాకు దారి తీయవచ్చు.
- ఇన్‌ఫెక్షన్ సోకిన మూడు నుంచి ఆరు రోజుల్లోగా లక్షణాలు బయట పడతాయి.
- చిన్నారులు, వృద్ధులు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో దీని తీవ్రత అధికంగా ఉంటుంది.

కరోనా వైరస్ మాదిరిగానే ఈ చైనా వైరస్ కూడా వేగంగా విస్తరిస్తుందని వైద్యులు చెబుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, క్యాన్సర్ బాధితులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఈ వైరస్ శరవేగంగా వ్యాప్తి చెందే అవకాశాలున్నట్లు వైద్యులు నిర్ధారణకు వచ్చారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్న వ్యక్తులపై కూడా వైరస్ ప్రభావం ఉంటుందని తెలుసుకున్నారు.



వ్యాప్తి ఎలా అంటే..

- హెచ్‌ఎంపీవీ వైరస్ పలు రకాలుగా వ్యాప్తి చెందుతోంది.
- దగ్గు, తుమ్ములు కారణంగా వెలువడే తుంపర్లతో వైరస్ వ్యాప్తి చెందుతుంది.
- వైరస్ వ్యాప్తి చెందిన వ్యక్తితో సన్నిహితంగా మెలగడం.
- వైరస్ బాధితులను తాకి ఆ చేతులతో ముక్కు, కళ్లు, నోరు తదితర ప్రాంతాలను తాకితే వస్తుంది.

నివారణకు ఏం చేయాలంటే..

రెండేళ్ల కరోనా వ్యాప్తిలో వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చారు. ఈ వైరస్ వ్యాప్తి నివారణలో కూడా వ్యక్తి శుభ్రత అవసరమని వైద్యులు చెబుతున్నారు.

- చేతులు శుభ్రత పాటించాలి. చేతులను తరచూ సబ్బుతో 20 సెకన్లపాటు రుద్ది కడుక్కోవాలి.
- చేతులు శుభ్రం చేసుకోకుండా కళ్లు, ముక్కు, నోటిని తరచూ తాకకూడదు.
- జలుబు లక్షణాలు, దగ్గు, తుమ్ములుంటే విధిగా మాస్క్ ధరించాలి.
- వైరస్ సోకిన వారు ఇంటి పట్టున్న ఉండడం ఉత్తమని వైద్యులు చెబుతున్నారు.



జిల్లా పరిస్థితి ఇదీ..

జిల్లాకు చెందిన వేలాది కుటుంబాలు కర్ణాటకలో స్థిరపడిపోయాయి. బతుకుదెరువు కోసం కూడా కొన్ని వేల కుటుంబాలు అక్కడికి వలస వెళ్లాయి. మరి కొన్ని కుటుంబాలు ఇక్కడి నుంచే వ్యాపార లావాదేవీలు నడిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిత్యం వేలాది మంది అక్కడి నుంచి ఇక్కడికి.. ఇక్కడి నుంచి అక్కడికి వస్తూ..పోతుంటారు. మూడు గంటల సమయంలో జిల్లా కేంద్రానికి చేరుకుంటుంటారు. ఇక పలమనేరు, వి.కోట, శాంతిపురం, కుప్పం, పుంగనూరు, ఇతర ప్రాంతాలను ఆనుకుని కర్ణాటక సరిహద్దు ఉంది. అలాగే కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి, చౌడేపల్లెలోని బోయకొండ గంగమ్మ దర్శనార్థం ఆ రాష్ట్రం నుంచి వందలాది మంది వస్తుంటారు. ఇక చిత్తూరు మీదుగా తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వేల సంఖ్యలో ప్రయాణం చేస్తుంటారు. ఈ క్రమంలో వైరస్ జిల్లాకు ప్రవేశించే అవకాశాలున్నాయని మెండుగా ఉన్నాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

భయపడొద్దు.. జాగ్రత్తే ముద్దు



కరోనా వ్యాప్తి సమయంలో ఏ జాగ్రతలు పాటించామో..ఇప్పుడు కూడా అలాగే ఉండాలి. ఏం కాదనే నిర్లక్ష్యం వద్దు. జిల్లాలో వైరస్ లేకున్నా..మన జాగ్రత్తలో మనం ఉంటే మంచిది. ప్రస్తుతం జిల్లాలో చలి తీవ్రత కూడా అధికంగా ఉంది. దీంతో జ్వరం, జలుబు, దగ్గు, శ్వాస కోశ సంబంధిత సమస్యలు రావడం సాధరణమే. అయితే నిర్లక్ష్యం చేస్తే ప్రాణం మీదకు వస్తుంది. వైరస్‌పై నిర్లక్ష్యం చేయకుండా మాస్కులు ధరించడం, చేతులు శుభ్రత పాటించడం వంటివి చేయాలి. ఏదైనా లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించి, వైద్య సేవలు పొందాలి. భయపడాల్సిన పనిలేదు.

– సుధారాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

ఆస్పత్రులను అప్రమత్తం చేశాం



హెచ్‌ఎంపీవీ వైరస్‌పై ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. తీవ్రమైన దగ్గు, జలుబు ఉన్న వ్యక్తులు వస్తే ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పింది. చిన్న పిల్లల వైద్యులను అలర్ట్ చేయాలని చెప్పింది. ఆస్పత్రుల్లో డాక్టర్లు విధిగా అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. ఐసోలేషన్‌కు 5నుంచి 10 బెడ్లు కేటాయించాలని ఆదేశించింది. ఆ రకంగా ఆస్పత్రి అధికారులకు చెప్పాం. అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నాం. ప్రజలు స్వీయజాగ్రత్తలు పాటించాలి.

– ప్రభావతి, డీసీహెచ్‌ఎస్, చిత్తూరు

ఆస్పత్రుల్లో అప్రమత్తం

రాష్ట్ర వైద్య, ఆరోగ్య నుంచి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, వైద్య విధాన పరిషత్ అధికారులకు వైరస్ అలర్ట్ అందింది. ఐసోలేషన్ వార్డు, బెడ్లు సమకూర్చాలని ఆదేశాలిచ్చింది. ఆక్సిజన్ సదుపాయం ఉండాలని పదేపదే తెలియజేసింది. కొన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని సూచించింది. ప్రధానంగా కోవిడ్–19కు వాడిన మందులు, ఫ్లూ సంబంధిత మందులను ఆస్పత్రిల్లో స్టాక్ ఉంచుతున్నారు. సోమవారం ఆస్పత్రి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ విపత్తు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.



చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో బెడ్లు



ల్యాబ్‌లో టెస్ట్‌లు చేస్తున్న టెక్నీషియన్లు (ఫైల్)

ఓటర్ల లెక్క.. పక్కా!



ఓటర్ల లెక్కను అధికారులు తేల్చారు. ఎస్ఎస్‌ఆర్–2025 పేరిట కొత్త జాబితా సిద్ధం చేసి, విడుదల చేశారు. చిత్తూరు జిల్లాలో గత ఎన్నికల నాటి కన్నా నేటి జాబితాలో ఓటర్లు పెరిగారు. ఈ సారీ అతివదే పైచేయి. యువ ఓటర్ల సంఖ్యా పెరిగింది.

- జిల్లాలో ఓటర్ల సంఖ్య 15,72,048
- ఏడు నియోజకవర్గాల్లో పెరిగిన ఓటర్లు
- గత సార్వత్రిక ఎన్నికలకంటే 8,137 ఓట్లు పెరుగుదల
- 18 నుంచి 19 ఏళ్ల ఓటర్లు 20,446 మంది
- తుది ఓటర్ల జాబితా విడుదల చేసిన అధికారులు

ఎస్ఎస్‌ఆర్ 2025 తుది ఓటర్ల వివరాలిలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
పుంగనూరు	1,17,523	1,21,996	4	2,39,523
నగరి	98,638	1,04,196	8	2,02,842
గంగాధరనెల్లూరు	1,02,581	1,03,492	4	2,06,077
చిత్తూరు	99,771	1,04,607	31	2,04,409
పూతలపట్టు	1,10,093	1,12,566	6	2,22,665
పలమనేరు	1,33,360	1,35,937	1	2,69,298
కుప్పం	1,13,287	1,13,929	18	2,27,234
మొత్తం	7,75,253	7,96,723	72	15,72,048

చిత్తూరు కలెక్టరేట్ : 2024 సార్వత్రిక ఎన్నికల కంటే ప్రస్తుతం స్పెషల్ సమ్మరి రివిజన్ (ఎస్ఎస్ఆర్–2025) పేరుతో జిల్లా అధికారులు విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాల్లో ఓటర్లు సంఖ్య పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనల ప్రకారం స్పెషల్ సమ్మరి రివిజన్ (ఎస్ఎస్ఆర్–2025)ను కలెక్టరేట్ అధికారులు పకడ్బందీగా నిర్వహించారు. ఇచ్చిన షెడ్యూల్ మేరకు ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, అభ్యంతరాలు, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన ఓటర్ల తొలగింపు ప్రక్రియను చేపట్టారు. ప్రస్తుతం జారీ చేసిన తుది జాబితా ప్రకారం జిల్లాలో 15,72,048 మంది ఓటర్లు ఉన్నారు. గత సార్వత్రిక ఎన్నికలకంటే ప్రస్తుతం విడుదల చేసిన జాబితాలో 8,137 ఓట్లు పెరుగుదల ఉంది. జిల్లాలోని పలమనేరు నియోజకవర్గంలో 2,69,298(అత్యధికం)గా, నగరిలో 2,02,842 (అత్యల్పం)గా ఓటర్లు నమోదయ్యారు. పుంగనూరులో 2,39,523, గంగాధర నెల్లూరులో 2,06,077, చిత్తూరులో 2,04,409, పూతలపట్టులో 2,22,665, కుప్పంలో 2,27,234 ఓటర్లు ఉన్నారు. అలాగే 18 ఏళ్ల నుంచి 19 సంవత్సరాల ఓటర్లు 20,446 మంది ఉన్నారు.

అతివలే అత్యధికం

అధికారులు ప్రచురించిన ఎస్ఎస్ఆర్ 2025 తుది ఓటర్ల జాబితాను పరిశీలిస్తే ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. పురుష ఓటర్లు 7,75,253 మంది ఉండగా మహిళా ఓటర్లు 7,96,723 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 21,470 మంది అధికంగా ఉన్నారు. అలాగే పలమనేరు నియోజకవర్గంలో అత్యధికంగా 1,35,937 మంది మహిళా ఓటర్లు ఉండగా, అత్యల్పంగా గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 1,03,492 మంది మహిళా ఓటర్లున్నట్లు తుది ఓటర్ల జాబితాలో పేర్కొన్నారు.

బోగస్ ఓట్లకు చెక్..

బోగస్ ఓటర్ల ఏరివేతకు ఫొటో సిమిలర్ ఎంట్రీస్ విధానం అవలంబించారు. ఓటర్ల జాబితాలో రెండేసి చోట్ల ఓటుహక్కు కలిగి ఉన్న వారిని అధికారులు గుర్తించారు. బూత్ స్థాయిలో బీఎల్వోలు సర్వే చేపట్టారు. ప్రతి ఓటరు ఫొటో ఆన్‌లైన్‌లో ఉండడంతో కొత్తగా ప్రవేశపెట్టిన సాంకేతికతతో రెండుచోట్ల ఓట్లు ఉన్నట్‌లైతే అటువంటి వాటిని తొలగించారు. అలాగే మృతి చెందిన ఓటర్లను తగిన ఆధారాలు సరి చూసిన తర్వాత తొలగించారు. జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సర్వే నిర్వహించి 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటర్లుగా జాబితాలో చేర్చారు.

పకడ్బందీగా ప్రక్రియ



స్పెషల్ సమ్మరి రివిజన్ (2025) ప్రక్రియను జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పకడ్బందీగా నిర్వహించాం. ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్‌ను తూ.చా. తప్పకుండా పాటించాం. క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పరిశీలన చేసి డబుల్ ఎంట్రీలు ఉన్నట్‌లైతే తొలగించాం. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాం. జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువత కచ్చితంగా ఓటర్లుగా నమోదయ్యేలా పకడ్బందీ చర్యలు చేపట్టాం.

– సుమిత్ కుమార్ గాంధీ, కలెక్టర్, చిత్తూరు

భక్తుల ఆరోగ్య భద్రతే లక్ష్యం

తిరుమల: శ్రీవారి దర్శనానికి వచ్చే యాత్రికుల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించడం టీటీడీ ప్రథమ లక్ష్యమని, తిరుమలలోని హోటళ్ల యజమానులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్యచౌదరి చెప్పారు. తిరుమలలోని ఆస్థాన మండపంలో సోమవారం హోటళ్ల యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తిరుమలలోని అన్ని హోటళ్లు, తినుబండార కేంద్రాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు భక్తుల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తినుబండారాల ఆవరణలో పరిశుభ్రత, పాటించాలని, నిబంధనలు, మార్గదర్శకాలను పాటిస్తూ తిరుమల ఖ్యాతిని నిలబెట్టాలని సూచించారు. అనంతరం దుకాణదారులందరికీ ఎస్‌ఓపీ జాబితాను సిద్ధం చేయాలని, చెక్‌లిస్ట్ ఇవ్వాలని, ఏవైనా కొరత ఉంటే వాటిని సరిదిద్దేందుకు కొంత సమయం ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్టేట్స్ అధికారి వెంకటేశ్వరులు, డిప్యూటీ ఈఓ, హెల్త్ ఆశాజ్యోతి, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, వీజీఓలు రామ్‌కుమార్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం సేంద్రియ సేద్యం

కుప్పం రూరల్: సేంద్రియ పద్ధతుల్లో సాగు చేపట్టడం ద్వారా ఆదాయం పెరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం కుప్పం చేరుకున్న బాబు సోమవారం సాయంత్రం కుప్పం మండలం, చీగలపల్లెలో సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్న రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతులకు కొన్ని ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. చంద్రబాబు మాట్లాడుతూ సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం ద్వారా దిగుబడి పెరగడంతో పాటు మనిషి సగటు వయస్సు 20 ఏళ్ల వరకు పెరుగుతుందన్నారు. రసాయన ఎరువులు వాడకం ద్వారా భూసారం త్వరగా తగ్గిపోతుందని పేర్కొన్నారు. ఇకపై కుప్పంలో 100 శాతం సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే రాయితీపై డ్రిప్ పరికరాలు అందిస్తున్నామన్నారు. వ్యవసాయానికి సాంకేతిక జోడించేందుకు ఐఐటీ కాన్పూర్ విద్యాలయంతో ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భజలాలు పెంచేందుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. వ్యవసాయ పంపు సెట్లు సైతం సోలార్ విద్యుత్‌తో పనిచేసే దిశగా వచ్చే సంవత్సరం చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ముఖ్యమంత్రి

పార్టీ కండువాలు వద్దు

ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి రోజు కుప్పం పర్యటనలో భాగంగా పీఎం సూర్యఘర్ పథకం ప్రారంభానికి సోమవారం మధ్యాహ్నం నడుమూరు గ్రామానికి చేరుకున్నారు. పీఎం సూర్యఘర్ కార్యక్రమం అధికారిక కార్యక్రమం కావడంతో అక్కడ ఏర్పాటు చేసిన సమావేశానికి పార్టీ కార్యకర్తలు, నాయకులెవరూ కండువాలు, బ్యాడ్జీలతో రావొద్దని కుప్పం ఎంపీడీఓ సాయి లహరి మైక్ ద్వారా పార్టీ కేడర్‌ను కోరారు. ఎంపీడీఓ ప్రకటనతో ఆగ్రహించిన టీడీపీ కార్యకర్తలు ఒక్కసారిగా ఎంపీడీఓ సాయి లహరిపై ఆగ్రహంతో ఊగిపోయారు. దీంతో రెండు నిమిషాల్లో తేరుకున్న ఎంపీడీఓ సాయి లహరి "మీ అభిమాన నాయకుడు మీ ఊరికి వచ్చారు.. మీ ఇష్టం వచ్చినట్లు రావచ్చు" అంటూ మరో ప్రకటన చేయడంతో పార్టీ కేడర్ శాంతించింది.

నిత్యాన్నదానానికి 10 టన్నుల కూరగాయలు

పలమనేరు: కర్ణాటక రాష్ట్రం చిక్‌బల్లాపూర్ ప్రాంతానికి చెందిన శ్రీవారి భక్తుడు బాగేపల్లి క్రిష్టప్ప టీటీడీ నిత్యాన్నదాన పథకానికి పది టన్నుల కూరగాయలను పలమనేరు మార్కెట్ నుంచి సోమవారం పంపించారు. వీటిని టీటీడీ వాహనంలో నింపి, ఆ వాహనానికి పూజలు చేసి ఇక్కడి నుంచి తరలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శ్రీవారి భక్తులు కాబ్బల్లి రవీంద్రారెడ్డి మిత్రబృందం పాల్గొన్నారు. దాతకు వీరు కృతజ్ఞతలను తెలిపారు.



తిరుమలకు కూరగాయలు తరలించే వాహనం ఎదుట దాత, శ్రీవారిసేవకులు

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా.. రైతు మృతి



దామోదరనాయుడి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

పెనుమూరు(కార్వేటినగరం): ట్రాక్టర్ బోల్తా పడి, రైతు మృతి చెందిన సంఘటన పెనుమూరు మండలంలోని జట్టిగుండ్లపల్లెలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. జట్టిగుండ్లపల్లెకు చెందిన రఘుపతినాయుడు కుమారుడు దామోదరనాయుడు(40) తన పొలాన్ని దున్నడానికి ట్రాక్టర్‌తో వెళ్లాడు. ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో దామోదరనాయుడు ట్రాక్టర్ ఇంజిన్ కింద పడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు వారు పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం మెనూలో స్వల్ప మార్పులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం మెనూలో స్వల్ప మార్పులు చేశారని డీఈఓ వరలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో స్వల్ప మార్పులు చేశారన్నారు. ఈ మార్పులను ప్రతి పాఠశాల హెచ్‌ఎం తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. శనివారం రోజున గతంలో గ్రీన్ లీఫీ వెజ్ రైస్ (పాలకూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా, సీజనల్ గ్రీన్ లీఫీ), పప్పు చారు, స్వీట్ పొంగల్, రాగిజావా అమలు చేసేవారని చెప్పారు. అయితే ప్రస్తుతం మారిన మెనూ ప్రకారం ప్రతి శనివారం అన్నం, సాంబార్, వెజిటబుల్ కర్రీ, స్వీట్ పొంగల్, రాగిజావాను విద్యార్థులకు పెట్టాలని డీఈఓ హెచ్‌ఎంలను ఆదేశించారు.

ఆశగా వచ్చి.. నిరాశగా వెనుదిరిగి!

- గ్రీవెన్స్ రద్దయినా విచ్చేసిన ప్రజలు
- అర్జీలు తీసుకునే వారు లేక ప్రజలు అవస్థలు



అర్జీలు అందజేసేందుకు కలెక్టరేట్‌కు విచ్చేసిన ప్రజలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉన్నతాధికారులకు తమ సమస్యల వినతులు సమర్పిస్తే.. పరిష్కారమవుతాయనే ఆశతో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు సోమవారం కలెక్టరేట్‌కు విచ్చేశారు. నూతన సంవత్సరంలో మొదటి గ్రీవెన్స్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)ను సీఎం పర్యటన కారణంగా అధికారులు రద్దు చేశారు. గ్రీవెన్స్‌ను రద్దు చేయకుండా కలెక్టరేట్ ఏఓతో వినతులు స్వీకరించవచ్చు. అయితే అధికారులు అలా చేయకుండా రద్దు చేశారు. ఇది తెలియక జిల్లాలోని నగరి, కుప్పం, పలమనేరు, పుంగనూరు ప్రాంతాల నుంచి వృద్ధులు కలెక్టరేట్‌కు విచ్చేశారు. తీరా చూశాక కార్యక్రమం రద్దు అయ్యిందని తెలియడంతో నిరాశతో వెనుదిరిగారు.

రెవెన్యూ కూతవేటు దూరంలోనే ఆక్రమణ



మాది పెనుమూరు మండలం. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ప్రభుత్వ కుంట పోరంబోకు స్థలం (సర్వే నంబర్ 468/1) ఆక్రమణకు గురైంది. కళావతి అనే ఆమె ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని కమర్షియల్ భవనం నిర్మిస్తోంది. ఈ తతంగం తహసీల్దార్‌కు తెలిసినప్పటికీ,మేము ఫిర్యాదుచేస్తున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ స్థలాలను రక్షించాల్సిన మండల రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. – నాగరాజనాయుడు, అర్జీదారుడు, పెనుమూరు మండలం

అధికార బలంతో భయపెడుతున్నారు!



మాది గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం గ్రామం. మా గ్రామంలో నా పేరుతో ఖాతా నంబర్ 972లో ఎకరాకు పైగా భూమి ఉంది. నా పేరుతో భూమి ఉన్నట్లు పాసుపుస్తకం, 1 బీ అడంగల్ కూడా ఉన్నాయి. అయితే నా భూమిని మాగ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు కుమార్ (పంచాయతీ కార్యదర్శి), శంకర్ (సర్వేయర్) లు ఆక్రమించుకుని అధికార బలంతో భయపెడుతున్నారు. కలెక్టర్ సార్ నా సమస్యను పరిశీలించి న్యాయం చేయాలి.

– సుగుణ, అర్జీదారు, తూగుండ్రం, గంగాధరనెల్లూరు మండలం

పింఛన్ కోసం వచ్చాను సామీ..



నేను ఒంటరి మహిళను. నిరుపేదనైన నాకు ఎవరూ లేరు. చాలా ఏళ్ల ముందు నా భర్త నన్ను వదిలి వెళ్లిపోయాడు. నాకు ఆరోగ్యం సైతం బాగాలేదు. పనిచేసేందుకు సత్తువ కూడా లేదు. పింఛన్ పొందేందుకు నాకు అర్హత ఉంది. సచివాలయం అధికారులకు వెళ్లి పింఛన్ ఇప్పించాలని కోరాను. మండల అధికారులకు వినతులు ఇచ్చాను. కానీ ఎవరూ నా సమస్య పట్టించుకోవడం లేదు. కలెక్టర్ సారైనా న్యాయం చేస్తారని ఆశతో వచ్చాను. తీరా ఇక్కడికి వచ్చాక కార్యక్రమమే లేకపోవడంతో నిరాశతో తిరిగి వెళ్తున్నాను.

– అరుణ, అర్జీదారు, మహాసముద్రం, బంగారుపాళెం మండలం

మా ఇంటి స్థలాన్ని ఆక్రమించుకున్నారు



మాది నగరి మండలం కరకంఠాపురం ఎస్సీ కాలనీ. మేము నివసించే ఇల్లు కొన్నేళ్ల క్రితం అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. మేము దళిత కులానికి చెందిన నిరుపేదలం. అగ్ని ప్రమాదంలో కాలిపోయిన మా ఇంటిని వేరొకరు ఆక్రమించుకున్నారు. న్యాయం చేయాలని చాలా సార్లు నగరి మండల అధికారులకు వేడుకున్నాను. ఎవరూ పట్టించుకోలేదు. వృద్ధాప్యంలో ఉన్న మాకు ఎవరూ న్యాయం చేయడం లేదు. మాకెవరూ దిక్కులేదు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి. అర్జీ ఇద్దామని నగరి నుంచి చిత్తూరుకు వచ్చాను. ఉన్నతాధికారులు ఎవరూ లేరు నిరాశతో వెళ్లిపోతున్నా.

– పాపమ్మ, అర్జీదారు, కరకంఠాపురం, ఎస్సీ కాలనీ, నగరి మండలం

శ్రీవారి దర్శనానికి 9 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 66,561 మంది స్వామివారిని దర్శించుకోగా 18,647 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.98 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 9 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

క్రీడల్లోనూ రాణించాలి

తిరుపతి సిటీ: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే అకడమిక్ విద్యతో పాటు క్రీడా రంగంలో రాణించాలని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ జేవీ రమణ పిలుపునిచ్చారు. సోమవారం వర్సిటీ వేదికగా ప్రారంభమైన 13వ వెటర్నరీ అంతర్‌కళాశాలల క్రీడాసాంస్కృతిక పోటీలను ఆయన వర్సిటీ అధికారులతో కలసి జ్యోతిప్రజ్వల చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసం, ఆరోగ్య సంరక్షణతో పాటు ఉన్నత విద్యకు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలలో ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వెటర్నరీ కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పోటీలలో పాల్గొనడం సంతోషకరమన్నారు. తొలిరోజు వాలీబాల్, బాస్కెట్ బాల్, టెన్నీకాయిట్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ప్రొద్దుటూరు, తిరుపతి, గన్నవరం, గరివిడి కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. సాంస్కృతిక పోటీలు ఆకట్టుకున్నాయి. డీన్లు కే.వీరబ్రహ్మయ్య, కే నాగేశ్వర్‌రావు, డాక్టర్ చైతన్య, ప్రవంతి పాల్గొన్నారు.

జెల్లి ఫ్యాక్టరీ ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న ఆవులనత్తం గ్రామస్తులు

కుప్పంరూరల్: మండలంలోని ఆవులనత్తం గ్రామం వద్ద నడుపుతున్న జెల్లి ఫ్యాక్టరీ కారణంగా తమ పంట పొలాలు నాశనమవుతున్నాయని, ఇళ్ల పగుళ్లు వస్తున్నాయని, తమకు న్యాయం చేయాలంటూ స్థానికులు జెల్లి ఫ్యాక్టరీ వద్ద సోమవారం నిరసనకు దిగారు. గ్రామస్తులు ఓ శిబిరం ఏర్పాటు చేసుకుని సోమవారం ఉదయం నుంచి నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న కుప్పం సీఐ శంకరయ్య నిరసన కారులకు నచ్చజెప్పినా ఫలితం లేకపోయింది. సీఎం పర్యటన ఉందని, తరువాత మాట్లాతామని పోలీసులు ఎంత నచ్చజెప్పినా ఫలితం లేక పోయింది. దీంతో చేసేది లేక పోలీసులు తిరుగుముఖం పట్టారు. నిరసనకారులు మాత్రం తమకు న్యాయం చేసే వరకు నిరసన విరమించేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు.

రంగు పడింది..!



కుప్పం ఇంటిగ్రేటెడ్ కార్యాలయంలో సీఎం ఫొటో, తెలుగుదేశం రంగులతో కూడిన బల్లలు



కుప్పంలోని తిరుపతి గంగమ్మ ఆలయానికి తెలుగుదేశం పార్టీ రంగు



కుప్పంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా రోడ్డుపై తొలగించిన స్పీడ్ బ్రేకర్లు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్రంలో ప్రభుత్వ భవనాలు, ఆలయాలకు సైతం పసుపు రంగులు అద్దారు. అందుకు ఉదాహరణగా ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంలోని తిరుపతి గంగమ్మ ఆలయానికి పసుపు రంగులను వేశారు. వీటితోపాటు కుప్పంలోని ప్రభుత్వ కార్యాలయం అయిన ఇంటిగ్రేటెడ్ కార్యాలయంలో ప్రజల సౌర్యార్థం బల్లలు వేశారు. ఆ బల్లలకు సైతం చంద్రబాబు ఫొటో, మన కుప్పం మన చంద్రన్న అనే బల్లలను పసుపు రంగులో వేశారు. దీంతోపాటు కుప్పం నియోజవర్గంలో మొత్తం ఈ బల్లలే కనిపించాయి. ప్రభుత్వ కార్యాలయంలో సైతం ఇలా తెలుగుదేశం పార్టీ రంగులను వేయడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. మరోవైపు కుప్పం నియోజకవర్గంలోని ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఇటీవలే నూతనంగా రోడ్లపై ప్రజాధనంతో వేసిన స్పీడు బ్రేకర్లను సైతం అధికారులు తొలగించడంపై కుప్పం ప్రజలు విమర్శిస్తున్నారు.

హిందూ ధర్మ ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథం ప్రారంభోత్సవ పూజలో ఆలయ అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన ప్రచార రథాన్ని సోమవారం ప్రారంభించారు. హిందూ ధర్మ ప్రచారం నిమిత్తం ఉద్దేశించిన ఈ ప్రచార రథంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం ఈఓ పెంచల కిషోర్ మాట్లాడుతూ, జిల్లాలోని మారుమూల గ్రామాలకు ధర్మ ప్రచార రథం వెళుతుందన్నారు. అక్కడ స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు మొగిలిలో ప్రచార రథ సేవ..

బంగారుపాళెం మండలంలోని మొగిలిలో మంగళవారం ప్రచార రథ సేవ నిర్వహిస్తామని ఈఓ పెంచలకిషోర్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు మొగిలీశ్వరస్వామి దేవస్థానం వద్ద ప్రచార రథానికి పూజలు జరుగుతున్నాయన్నారు. సనాతన ధర్మ సూత్రాలు, నైతిక విలువలు, ఆలయ పవిత్రతపై స్థల పురాణంపై భక్తులకు తెలియపరుస్తారన్నారు. అలాగే ప్రవచనాలు, భజనలు, కోలాటం, చెక్క భజన, భక్తి గీతాలు, గోపూజ, కల్యాణోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య



చంద్రశేఖర్ (ఫైల్)

పుంగనూరు: పట్టణంలోని ప్రముఖ వ్యాపారి రమేష్ బాబు కుమారుడు చంద్రశేఖర్(30) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చంద్రశేఖర్ ప్రతి రోజు తమ చింతగింజల ఫ్యాక్టరీని పర్యవేక్షించేవాడు. ఇలా ఉండగా మధ్యాహ్నం వెళ్లిన చంద్రశేఖర్ ఫ్యాక్టరీలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిని గమనించిన ఫ్యాక్టరీలో పని చేసే వారు వెంటనే చంద్రశేఖర్‌ను కాపాడే ప్రయత్నం చేశారు. కానీ ఫలితం లేక పోయింది. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. శవాన్ని పోస్టుమార్టానికి తరలించి, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

దళితులకు రక్షణ కల్పించాలి



బాధితులతో చర్చిస్తున్న కేవీపీఎస్ నాయకులు

నగరి : మండలంలోని తడుకుపేట దళితులపై దాడి చేయడమే కాకుండా వారి వాహనాలు తగలపెట్టిన అగ్రకులస్తులపై చర్యలు తీసుకుని దళితులకు రక్షణ కల్పించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాంజీవరం సురేంద్రన్, అన్నూరి ఈశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం తడుకు దళితవాడకు వెళ్లిన వారు బాధిత దళితులను పరామర్శించి, వారిలో చైతన్యం నింపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందన్న అహంకారంతో దళితులు గ్రామం వదిలి వెళ్లిపోవాలని ఆంక్షలు విధించడం తగదన్నారు?. గొడవలు సద్దుమణిగినా రకరకాల పద్ధతుల్లో రాజకీయ కక్షలతో దళితులను బలి చేయడం దుర్మార్గమైన కుల దురహంకార చర్య అన్నారు. దళితుల పిల్లలు స్కూలుకు రాకూడదని బయటకు పంపడం సిగ్గు చేటన్నారు. గుడిలోకి రాకూడదని, రకరకాల పద్ధతులు ఆంక్షలు పెట్టడం దుర్మార్గమన్నారు. మహిళలకు రక్షణ లేకుండా ఇబ్బంది పడుతున్న పరిస్థితి రాష్ట్రానికే అవమానకరమన్నారు. రాజ్యాంగం ప్రకారం అందరూ సమానమైనప్పటికీ దళితులపై వివక్ష చూపడం సిగ్గుచేటన్నారు. దెబ్బలు తగిలి ఆస్పత్రిలో ఉన్నవారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. సమస్యలను రాజకీయాలకు ముడిపెట్టి దళితులకు మహిళలకు రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని కేసులు దళితులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెరుమాళ్, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటు

వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప, చిత్రంలో భాస్కర్‌రెడ్డి, అలీమ్‌బాషా, షరీఫ్

పుంగనూరు: కరువుకు చిరునామా అయిన పుంగనూరు నియోజకవర్గంలో కేవలం ఏడాది కాలంలోనే పరిశ్రమ ఏర్పాటు చేయించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని మాజీ ఎంపీ రెడ్డెప్ప కొనియాడారు. సోమవారం మండల కార్యాలయంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దిన్‌షరీఫ్‌తో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ మండలంలోని ఆరడిగుంటలో రూ.250 కోట్లతో శ్రీకాళహస్తి ఫెర్రా అల్లాయ్ కంపెనీ ఏర్పా టు చేసేందుకు మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రా మచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి కృషి ఫలితంగా ఫ్యాక్టరీ ప్రారంభమైందన్నారు. ఇందులో 1500 మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు. కర్ణాటక సరిహద్దులోని మారు మూల గ్రామమైన ఆరడిగుంటలో ఫ్యాక్టరీ ప్రారంభం కావడంతో ఆ ప్రాంతం పట్టణ శోభను సంతరించుకుందన్నారు. పుంగనూరును పారిశ్రామిక కారిడార్‌గా ఏర్పాటు చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుమారు 10 వేల ఎకరాలను గుర్తించిందన్నారు. ఇందులో భాగంగా జర్మన్ షెప్పర్ మోషన్ ఎలక్ట్రికల్ బస్సుల కంపెనీ వారు సు మారు రూ.5 వేల కోట్లతో ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని ఎంపీ మిథున్‌రెడ్డి కోరడంతో ఇక్కడికి రావడం జరిగిందన్నారు. భూసేకరణ పనులు కూడా దాదాపుగా పూర్తి అయ్యాయన్నారు. ప్రభుత్వం మారడంతో ఈ పనులకు బ్రేక్ పడిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోకుండా, బస్సుల కంపెనీకి అనుమతులు మంజూరు చేసి ఏర్పాటు చేయాలన్నారు. దీని ద్వారా సుమారు 3 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి లభించడంతో పాటు అన్ని విధాల పుంగనూరు అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. రాజకీయాలతో అభివృద్ధిని అడ్డుకోవడం మంచిదికాదన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ఫ్యాక్టరీ ప్రారంభం కావడం శుభపరిణామమన్నారు. ఫ్యాక్టరీలకు అనువైన ప్రాంతాలను గుర్తించి, పరిశ్రమలకు ప్రోత్సాహం అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి మండల ప్రజలు రుణపడి ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఆరడిగుంట సర్పంచ్ శంకరప్ప, ఎంపీటీసీ సభ్యుడు నంజుండప్ప, మాజీ ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, పార్టీ నాయకులు రెడ్డెప్ప, రమణ, రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐని సస్పెండ్ చేయాలని దీక్ష

- సీఐ హామీతో విరమణ



పుంగనూరులో సమావేశమైన ఎస్సీ,ఎస్టీ సంఘాల నేతలు డాక్టర్ మునీంద్రనాయక్, హరిశివప్ప

పుంగనూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్‌ఐ మహేంద్రరావును సస్పెండ్ చేయాలని, అతనిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ బాధితుడు మురళీనాయక్, తన మైనర్ కుమార్తెతో కలసి సోమవారం నిరసన దీక్ష చేపట్టాడు. మండలంలోని నల్లగుట్లపల్లెతాండకు చెందిన మురళీనాయక్ తన కుమార్తెతో కలసి స్టేషన్‌కు రాగా ఏఎస్‌ఐ మహేంద్రరావు కులం పేరుతో దూషించి, అసభ్యంగా మాట్లాడి బెదిరించాడని, దీనిపై మనస్తాపానికి గురైన మురళీనాయక్ ఆత్మహత్య చేసుకుంటానంటూ విడుదల చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ ఘటన జరిగి 24 గంటలు గడిచినా ఏఎస్‌ఐపై చర్యలు తీసుకోకపోవడంతో బాధితుడు మురళీనాయక్ తన మైనర్ కుమార్తెతో కలసి స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించాడు. ఈ విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాసులు, బాధితుడి వద్దకు చేరుకుని సమస్యపై చర్చించారు. ఈ విషయమై జిల్లా ఎస్పీకి నివేదికలు పంపామని, తక్షణమే ఏఎస్‌ఐపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి స్టేషన్‌కు తీసుకెళ్లి అతనికి, వారి సామాజిక వర్గానికి చెందిన పెద్దమనుషులకు సమాధానం చెప్పారు. దీంతో బాధితుడు దీక్ష విరమించాడు.

కేసు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల డిమాండ్

గిరిజన కులానికి చెందిన మురళీనాయక్‌ను కులం పేరుతో దూషించి, బెదిరించిన ఏఎస్‌ఐ మహేంద్రరావుపై ఎస్సీ , ఎస్టీ కేసు నమోదు చేసి, అతనిని సస్పెండ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కమిటీ జిల్లా సభ్యుడు డాక్టర్ బాణావత్ మునీంద్రనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జెడ్పీ బంగ్లాలో ఎస్సీ, ఎస్టీలతో సమావేశం నిర్వహించారు. ఏఎస్‌ఐ కులం పేరుతో దూషించడం, బెదిరించినట్లు రుజువైందన్నారు. ఈ విషయాలపై జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు హరిశివప్ప, సంత్‌సేవాలాల్ ప్రధాన కార్యదర్శి రెడ్డినాయక్, ప్రతినిధులు శంకర్‌నాయక్, రవింద్రనాయక్, శివాజినాయక్, బాలాజినాయక్, శ్రీరాములునాయక్, ఉమామహేశ్వరరావు, హరి తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరు జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మురళీనాయక్